ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ


పత్రాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, జూలై 5: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తన బృందంతో తనిఖీ చేశారు. జిల్లా రిజిస్ట్రేషన్ ఆక్ట్ ప్రకారం బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇతర పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు (అలో ఎతి, ఆయుష్, యూనాని, సిద్ధ) తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. తెలం గాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆక్ట్ 2010 ప్రకారం నిబంధనలకు లోబడి రిజి స్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసు పత్రులు, స్కానింగ్ సెంటర్లు తప్పని సరిగా తెలుగు, ఇంగ్లీస్ భాషల్లో ధరల పట్టిక బోర్డు లను ప్రదర్శించాలని ఆదే శించారు. అంతే కాకుండా డాక్టర్ల వివ రాలు, సిబ్బంది వివ రాలు ప్రదర్శించా లన్నారు. ఆసుపత్రి వ్యర్థాలను బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్ మెంట్ వారికి ఇస్తే నిబంధనల ప్రకారం, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాలను నిర్మూలి స్తారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం లేని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.



ఆడబిడ్డపై పెరుగుతున్న అరాచకాలు

ఏడాదిలో 565 కేసులు నమోదు

- ఆగని అత్యాచారాలు, వేధింపులు

కరీంనగర్ క్రైం, జూలై5: ఆడబిడ్డపై అరాచకాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్లిన మహిళలు, యువతులపై లైంగిక వేధింపులు పెరిగాయి. వివాహం అనంతరం అదనపు వరకట్నం, ఆడ సంతానం, అనుమానాలపై భర్త, అత్తింటి వారు పెట్టే హింసలు భరించలేక ఆత్మహత్యలు పెరిగాయి. వీటికి తోడు పాఠశాల, కళాశాల విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్ తప్పడం లేదు. ప్రేమ పేరుతో యువతులను వంచించి మోసాలకు పాల్పడుతున్న వారి సంఖ్య కూడా ఏటేటా పెరిగిపోతూనే ఉంది. మహిళలపై వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్ వంటి నేరాలు ఏటేటా పెరుగు తున్నా వాటికి అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయనే విమర్శలున్నాయి. నేరాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త చట్టాలను తీసుకువచ్చినప్పటికీ నేరాలను నియంత్రించలేక పోతున్నారు. చట్టాలెన్ని ఉన్నా వేధింపులకు గురవుతున్న అబలలకు న్యాయం జరగటంలేదనే విమర్శలు బాధితుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

• పెరుగుతున్న వేధింపులు

మహిళలకు సంబంధించిన వేధింపుల కేసులే ఉండటం గమనార్హం. కమిషనరేట్ వ్యాప్తంగా 2023లో మహిళలపై 565 వివిధ రకాల నేరఘటనలపై కేసులు నమోదయ్యాయి. ఇందులో 25 అత్యాచారాల కేసులు, 58 పోక్సో కేసులు నమోదు కాగా మహిళలు, యువతులు, విద్యార్థినిల వేధింపులపై 201 ఫిర్యాదులు షీటీం పోలీసులకు అందాయి. 10 మంది పోకిరీలపై ఎఫ్‌ఐఆర్‌లు చేయగా మరో 38 మంది పోకిరీలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించి వదిలిపెట్టారు. మరో 100 మందిపై పెట్టి కేసులు నమోదు చేశారు. మహిళలకు అన్నిచోట్ల వేధింపులు తప్పటంలేదు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల్లో మహిళ ఉద్యోగులు వారు పని చేసే చోట తోటి ఉద్యోగులు, యజమానుల నుంచి వేధింపులకు గురవుతూనే ఉన్నారు.

• ఫిర్యాదుల కమిటీలు

పనిప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయటానికి ఆయా సంస్థల్లో యజమానులు ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ఈ ఫిర్యాదుల కమిటీలో 50 శాతం మహిళలను నియమించాలి. మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై ఈ ఫిర్యాదుల కమిటీకి బాధితులు ఫిర్యాదు చేసిన సందర్భంలో కమిటీ విచారణ జరిపి లైంగిక వేధింపులు నిజమని వెల్లడైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది. కమిటీ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అయితే మహిళలకు ఈ ఫిర్యాదుల కమిటీ, చట్టాలపై అంతగా అవగాహన లేక పోవటంతోపాటు, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేస్తే ఈ విషయం అందరికి తెలిసి పరువుపోతుందనే భావన, భయంతో మిన్నకుండిపోతున్నారు. దీంతో మహిళలు వేధింపులకు గురవుతూనే ఉన్నారు.

భూముల ధరలు పెంపునకు కసరత్తు

- 10 నుంచి 50శాతం వరకు పెరిగే అవకాశం
- ఆగస్టు 1నుంచి పెరిగిన ధరలు అమల్లోకి
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేసిన అధికారులు


తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయ, విక్రయదారులు (ఫైల్)

తిమ్మాపూర్, జూలై5: వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులకు కొత్త ధరలను నిర్ణయించే పనుల్లో అధికారులు నిమగ్నమై ఉన్నారు. దీనికి సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం భూములు, ఆస్తుల విలువలను సవరించాలని నిర్ణయించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ విడుదల చేసిన మార్గదర్శలతో ఇప్పటికే తిమ్మాపూర్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాలకు సంబంధించి భూములు, ఆస్తులకు సంబంధించి సర్వే పూర్తి చేసి నివేదిక ఉన్నతాధికారులకు అందించారు. మార్కెట్ విలువ పెంపుపై ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ భూములు, స్థలాలు, వెంచర్లు, అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించారు. నేషనల్ హైవే, సబ్ హైవేలకు, ఇంటర్నల్ రోడ్లు, ప్రస్తుత ఇళ్లు, డిమాండ్ ఉన్న ప్రాంతాల సమీపంలో ఉన్న భూములు, కమర్షియల్‌గా ఉపయోగిస్తున్న వాటి సర్వే నెంబర్లు అధికారులు సేకరించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఏ భూములకు ఎంతెంత ధరలు పెంచాలనే దానిపై కసరత్తు చేసి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించారు. రాజీవ్ రహదారికి అనుకొని ఉన్న గ్రామాలకు ముఖ్యంగా ధరలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంతో పాటు హైవేపై ఉన్న కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ గజం 2,100 రూపాయలు గరిష్టంగా, కనిష్టంగా 1,100 రూపాయలు ఉంది.

● ధరలకు రెక్కలు

రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూముల్ని కొనుగోలు చేసి వెంచర్లుగా చేసి గజాలుగా విక్రయిస్తున్నారు. దీంతో కొన్ని గ్రామాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంతో ఇంకా ధరలకు రెక్కలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రోడ్లు, మౌలిక వసతులు ఉన్న గ్రామాల భూములకు ఎక్కువగా ధరలు నిర్ణయించే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా ఈ ధరలు 10శాతం నుంచి 50శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మరో వైపు వ్యవసాయ భూముల ధరలు పెరగడం ద్వారా రైతులకు మేలు కలిగే అవకాశం ఉంటుంది. బ్యాంకు రుణాలు అధికంగా వచ్చే అవకాశం ఉంది.

ధరల పెంపుపై ఉన్నతాధికారులకు నివేదిక

- ఎస్.రాజేష్, సబ్ రిజిస్ట్రార్, తిమ్మాపూర్



తహసీల్దార్‌ల సహకారంతో నిబంధనలకు అనుగుణంగా సర్వే నెంబర్లు సేకరించి ధరల పెంపుపై కసరత్తు చేసి పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. గజానికి 10నుంచి 50శాతం మేర పెరిగే అవకాశం ఉందని అంచనా. ఎప్పటిలాగే రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. హైవేలు, ప్రధాన రహదారుల వెంట ఉన్న భూముల ధరలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది.

బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలి

- సింగరేణి సంస్థకే కేటాయించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సుభాష్‌నగర్,జూలై 5: బొగ్గు గనుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని, సింగరేణి సంస్థకే కేటాయించాలని లేదంటే పోరా టాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణకు తలమానికమైన బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం అంటే తెలంగాణ తలను నరికివేసి మొండాన్ని మిగిల్చడమేనని అన్నారు. ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోదీ రామగుండం పర్యటన చేసిన సందర్భంగా సింగరేణిని వేలం వేయమని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచాక తెలంగాణ సంపదను కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆ సంపదను దోచుకోవడానికే తెలంగాణ ప్రాంతానికి చెందిన కిషన్‌రెడ్డికి బొగ్గు గనుల కేంద్రమంత్రి పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వినతిపత్రాలకు పరిమితం కాకుండా బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, అఖిలపక్ష పార్టీలను ఆహ్వానించి పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, కిషన్‌రెడ్డి వేలంపాటలో స్వయంగా పాల్గొనడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకొని తెలంగాణ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న నరేంద్ర మోదీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో బొగ్గు బ్లాక్‌ల రద్దు చేయాలని పోరాడాలని లేదంటే తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చరించారు. వామపక్ష పార్టీలు అన్ని ట్రేడ్ యూనియన్‌లను, ఇతర పార్టీలను కలుపుకొని లోపల పార్లమెంటులో, బయట ప్రత్యక్ష ఆందోళన, పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు మంద పవన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, తెలుగుదేశం నగర అధ్యక్షులు కల్యాడపు ఆగయ్య, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొన్నగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి

జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ టౌన్, జూలై 5: జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలకవర్గ గడువు గురువారం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ జడ్పీ ప్రత్యేకాధికారి బాధ్యతలను స్వీకరించగా, పలువురు అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన

సుభాష్‌నగర్, జూలై5: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవే ర్చాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బీజేవై ఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడిం దన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే చేస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని సంపత్ విమర్శించారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగులకు చేయూత, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగాల న్నింటికీ నోటిఫికేషన్‌ల హామీలను కాంగ్రెస్ విస్మరించిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభు త్వం రాజకీయ నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడం కోసం ప్రతినిత్యం పనిచేస్తుం దన్నారు. నిరుద్యోగులతో పెట్టుకుంటే గతంలో బీఆర్ ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంద న్నారు. బీజేవైఎం శ్రేణులను ముందుస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రూపు-1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూపు-2, గ్రూపు-3 నోటిఫి కేషన్లలో అదనంగా పోస్టులను పెంచా లని, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, అన్ని నియా మకాల్లో మహిళలకు 33శాతం రిజర్వే షన్ అమలు చేయాలన్నారు. పోలీసు కానిస్టేబుల్ నియమకాల్లో 46జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి క్రాంతి, మీడియా ఇంచార్జీ కటకం లోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శశిధర్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీకాంత్, ప్రవీణ్, ఉప్పారపల్లి శ్రీనివాస్, కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సంపత్, అజయ్, నికేష్, అశోక్, అనిల్, తోట సాయి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు

మున్సిపల్ దుకాణాలపై అధికారుల కొరడా

లీజు అగ్రిమెంట్ దాటినా మడిగెలను ఖాళీ చేయని వైనం

- మూడునెలల క్రితం టెండర్ ప్రక్రియ పూర్తి
- నోటీసులకు స్పందించని వ్యాపారులు
- కమిషనర్ ఆదేశాలతో 20 దుకాణాలకు తాళం



కరీంనగర్ టౌన్, జూలై 5: నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాల్లో అద్దె బకాయిలను చెల్లించకుండా, లీజు అగ్రిమెంట్ దాటినా కూడా మడిగెలను ఖాళీ చేయకుండా తిష్టవేసిన దుకాణదారులపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపిం చారు. మున్సిపల్ నిధులతో నగరంలోని కూరగాయల మార్కెట్, మున్సిపల్ కార్యా లయం, రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలో వాణిజ్య సముదాయాలను నిర్మించి బహిరంగ వేలంలో ఆయా దుకాణాలను అద్దెకు ఇచ్చారు. అయితే రాజీవ్‌గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు కూరగాయల మార్కెట్ లోని దుకాణాల 30 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ పూర్తి కావడంతో మూడు నెలల క్రితం టెండర్లు నిర్వహించారు. టెండర్లలో దుణాకాలను దక్కించుకున్న వారికి మడిగెలను ఖాళీ చేయించి ఇవ్వాల్సిన బాధ్యత నగరపాలక సంస్థకు ఉంటుంది. దీనితో టెం డర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే లీజు అగ్రిమెంట్ పూర్తయి నందున తిరిగి టెండ ర్లను నిర్వహించామని, అద్దె బకా యిలేమైనా ఉంటే వాటిని వెంటనే చెల్లించి దుకాణాలను ఖాళీ చేయాలం టూ లీజు దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. దాదాపు 60 లక్షల మేరకు అద్దె బకాయిలుండడంతో వారిపై బకాయిలను చెల్లించాలంటూ చట్ట ప్రకారంగా ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో పార్ల మెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రావడం, అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. నోటీసులు ఇవ్వడంతో ఒకరిద్దరు అద్దె బకాయిలు చెల్లించగా మిగిలిన వారు అద్దె బకాయిలు ఇవ్వకపోగా దుకాణాలను నడిపించుకుం టున్నారు. మరోవైపు టెండర్లలో మడిగెలను దక్కించుకున్న వారికి మడిగెలను అప్పగిం చాలని అధికారులను కోరుతున్నారు. ఇటీవల మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ నగరపాలక సంస్థలో ఒక్కో విభాగంపై ప్రత్యేక దృష్టిసారించారు. పెరుగు తున్న ఖర్చులకు అనుగుణంగా అదనపు ఆదాయాలపై, బకాయిలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి వాణిజ్య సముదా యాలకు సంబంధించిన అద్దెబకాయిల వివరాలను తెలుసుకొని వెంటనే వారిపై చర్య తీసు కోవాలని ఆదేశించారు. దీనితో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్. ఆంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎండి.రషీద్, ఎస్.శ్రీకాంత్, ఎండి.ఖలీల్, ఆర్.బాబు, డీఆర్‌ఎస్ సిబ్బం దితో కలిసి లీజు అగ్రిమెంట్ పూర్తయినందున బకాయిలు చెల్లించి వెంటనే ఖాళీ చేయాలని దుకాణదా రులకు సూచించారు. రాజీవ్‌గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో ఆరు దుకాణాలు, కూరగాయల మార్కెట్ సమీపంలోని 14 దుకాణాలకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లా డుతూ ముగ్గురు దుకాణ దారులు దాదాపు 30 లక్షల మేరకు అద్దెబకాయిలు చెల్లించాల్సి ఉందని, మొత్తం 20 దుకాణాలకు సంబంధించి 60 లక్షల అద్దె బకాయిలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉందని అన్నారు. అద్దెబకాయిలను చెల్లించాలంటూ పలుమార్లు నోటీసులు అందించినా వారు చెల్లించకపోవడం, లీజు అగ్రిమెంట్ 30 ఏళ్ల పూర్తయినవారు దుకాణాలను ఖాళీ చేయకపో వడంతో కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు 20 దుకాణాలకు తాళం వేసి సీజ్ చేశామని చెప్పారు. మున్సిపల్‌కు చెల్లించాల్సిన పన్ను బకాయిలన్నిటినీ వసూలు చేస్తున్నామని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రాజీవ్‌గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు తాళం వేసిన మున్సిపల్ అధికారులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

- మంత్రి సీతక్కను కోరిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ అర్బన్/మానకొండూర్/తిమ్మాపూర్, జూలై 5 : మానకొండూర్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో కొత్తగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయా లని మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఇప్పటికే కొనసాగుతున్న పంచాయతీరాజ్ పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా కొత్తగా చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనులకు సంబం ధించి ప్రతిపాదనలు అందజేశారు. శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రతిపాదిత పనులకు బడ్జెట్ కేటా యింపుతో పాటు పురోగతిలో ఉన్న పనులకు సత్వరమే నిధులు మం జూరు చేయాలని కవ్వంపల్లి కోరారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కాలుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇబ్బందులు పడుతున్న రైతులు


మరమ్మతుల కోసం తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర, జూలై 5: వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. తరచూ విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లతో మరమ్మతు కేంద్రాలకు పరుగెత్తుతున్నారు. గంగాధర మండలంలో ప్రధానంగా వ్యవసాయం బావులు, బోర్లకింద వరి, వివిధ పంటలు సాగుచేస్తారు. మండల వ్యాప్తంగా సుమారుగా 8,500 పైచిలుకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటికి వివిధ స్థాయిలను బట్టి 16,25,63,100 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు గంగాధర మండల వ్యాప్తంగా 475 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా 4 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు నిల్వ ఉంచుతారు. కాలిపోయిన సమయంలో దానిని మరమ్మతులు జరపడం సమయం పడుతున్నందున రిజర్వులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందిస్తారు. గంగాధరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు షెడ్డు ఈ సారి తట్టుకోలేక పోతుంది. ఇటీవల లక్ష్మీదేవిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా గంగాధరలో లేకపోవడంతో రైతులు చొప్పదండి మండలం భూపాలపట్నం షెడ్డుకు 25 కిలోమీటర్ల దూరం నుంచి 10వేలు రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకున్నారు.ఇప్పుడంతా లోటు కారణంగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేక పోతున్నామని విద్యుత్ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెల రోజుల్లో 475..

తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నెలలోనే 475 కాలిపోయాయంటే రిపేర్‌లోపమా, లోవోల్టేజీ సమస్య అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రిపేర్ షెడ్డుకు వచ్చిన రెండు రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకందించాల్సి ఉండగా ఈ సారి ఎక్కువగా కాలిపోవడంతో సాధ్యపడలేదని సిబ్బంది తెలుపుతున్నారు. దీనిపై కాలిదాస్,డీఈ(ఎంఆర్‌టీ)ని వివరణ కోరగా 80 శాతం లూజువైర్ల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతు న్నాయన్నారు. గాలి ఎక్కువగా వీయడం వల్ల వైర్లు ఒకదానికొకటి తాకి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు.

● రైతులపైనే రవాణా భారం

సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు కరెంటు సమస్యలు ఎక్కువయ్యాయి. పలు సమస్యలతో ప్రతిసారి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సమయంలో రైతులపైనే భారం పడుతోంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆటో, ట్రాక్టర్ కిరాయికి తీసుకుని రిపేరు షెడ్డుకు పోవాల్సిందే. ప్రత్యేకంగా రిపేరు షెడ్డుకు వెల్లాల్సిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వినియోగిస్తున్న రైతులకు6 నుంచి 10 వేల ఖర్చు అవుతోంది.


నాణ్యత ప్రమాణాలను పరీక్షిస్తున్న అధికారులు

గ్రోమోర్ షాపులో చోరీ

- రూ. 38,476 అపహరించిన దుండగులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని అనుకొని ఉండే కోరమండల్ ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో చోరీ జరిగింది. షాపు మేనేజర్ రాయిని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రోమోర్ షాపులో గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. శుక్రవారం ఎరువుల దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించారు. కేశవపట్నం పోలీసులు క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. గురువారం ఎరువులు, పురుగుల మందులు అమ్మగా వచ్చిన రూ. 38,476 నగదు లాకర్‌లో ఉంచారు. రూ. 46,717 విలువ చేసే క్రిమిసంహారక మందులను దొంగలు దోచుకెళ్లారు. దు కాణంలో దాచిన లాకర్‌ను దుకాణం సమీపంలోని పొలాల వద్దకు ఎత్తుకెళ్లిన దుండగులు పగలగొట్టి అందులో దాచిన రూ. 38,476 నగదును దోచుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో చోరీపై ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బండపల్లి గ్రామంలో కుమ్మరి శ్రీవాణి అనే బాలికను ఇంటి నిర్మాణం విషయంలో బాబు, చిరంజీవి, రవి వ్యక్తులు వేధింపులు చేయడంతో ఈ నెల 1న ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబు, చిరంజీవి, రవిలపై కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మెట్‌పల్లి రూరల్, జూలై 5: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించిన నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని రామలచ్చక్కపేట గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ట్రాక్టర్లు స్వాధీ నం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేశామని వివరించారు.. అవసరమైన వారు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ బాలిక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం ఊరడి వెంకటి - పుష్ప దంపతుల కుమార్తె మహేశ్వరి(16) 15 రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌండ్ పొల్యూషన్‌పై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 5: కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన వాహనాలపై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ధ్వని కాలుష్యానికి కారణమైన జిల్లెల్లకు చెందిన మణివర్ధన్ కేటీఎం మోటార్ సైకిల్, కామెల్లి శ్రావణ్‌కు చెందిన రాయల్ యన్‌ఫీల్డ్ బైక్, బోద అంజికి చెందినా రాయల్ యన్‌ఫీల్డ్ వాహనాలు స్వాధీనం చేసుకొని కొత్త న్యాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. వాహనాలకు సైలెన్సర్‌లు మార్చి ధ్వని కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపు


చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లికి వెళ్లే రోడ్డు మూలమలుపు

చిగురుమామిడి, జూలై 5: మండలంలోని చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామం చివరన ఉన్న ములమలుపు ప్రమాదకరంగా మారిందని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వారు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో ఒక్కటైన కుటుంబం

● తల్లి మృతి.. జైలులో తండ్రి ● 14ఏళ్లుగా అనాథాశ్రమంలో పిల్లలు

● ఖైదీల విడుదలతో పిల్లల చెంతకు చేరిన తండ్రి


తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న స్పందన నిర్వాహకుడు వీరస్వామి

జమ్మికుంట రూరల్, జూలై 5: సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆ కుటుంబంలో కొత్త కాంతులను నింపింది. తల్లిదండ్రుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో తల్లి మృతి చెందింది. ఇందుకు కారకుడని తండ్రిపై కేసు నమోదు కావడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. దీనితో వారి పిల్లలు ఒంటరి వారయ్యారు. ఆలనా పాలనా చూసే వారు కరువవ్వడంతో ఇద్దరు పిల్లలు పద్నాలుగేళ్లుగా అనాథాశ్రమంలోనే పెరిగారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయగా పిల్లలు జైలునుంచి వచ్చిన తండ్రి చెంతకు చేరారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య క్షణికావేశంలో భార్య సత్తమ్మను నెట్టగా ప్రమాదవశాత్తు మరణించింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో జరిగింది. న్యాయస్థానం సారయ్యకు యావజీవ శిక్ష విధించింది. అప్పుడు వారి కుమార్తె పూజకు 5సంవత్సరాలు, కుమారుడు బన్ని 4సంవత్సరాల వయస్సు. పిల్లలను పెంచేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసుల సహకారంతో కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి వారు ఆశ్రమంలోనే ఉంటూ ఇద్దరూ చదువుకుని పెద్దవారు అయ్యారు. ప్రస్తుతం పూజ డిగ్రీ ఫైనల్ ఇయర్, బన్ని ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కింద ప్రభుత్వం సారయ్యను విడుదల చేసింది. ఆశ్రమంలోని పిల్లల వద్దకు వచ్చిన తండ్రి పిల్లలను చూసి ఉద్వేగానికి గురయ్యాడు. వారిని దగ్గరకు తీసుకుని కన్నీటి పర్యంతం అయ్యాడు. పూజ, బన్నిలను స్పందన ఆశ్రమ నిర్వాహకులు గోపరాజు వీరస్వామి తండ్రికి అప్పగించాడు.

బెట్టింగ్ యాప్స్ నిర్వాహకుల అరెస్ట్

- రూ.33 లక్షలు, కారు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు

సుల్తానాబాద్, జూలై 5: బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తూ యువత నుంచి లక్షల రూపాయలను కొల్లగొడుతున్న ముఠాను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 33 లక్షల పది వేల రూపాయల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమారు తెలిపిన వివరాల ప్రకారం.. సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ, ఏసీపీ, సుల్తానాబాద్ సీఐల పర్యవేక్షణలో సుల్తానాబాద్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారును తనిఖీ చేయగా రూ.33 లక్షల నగదు పట్టుబడింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ముల్కల రాజేశ్, చిన్నపల్లి అభిలాష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన నిమ్మల ధనుంజయ్‌లు ముఠాగా ఏర్పడి 55 క్లబ్, తిరంగా యాప్, 82 లాటరీ తదితర ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తూ యువకుల నుంచి లక్షలాది రూపాయలు లూటీ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా వచ్చిన డబ్బులను తీసుకుని హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తుండగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కనుకయ్య(50) అనే రైతు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పాల్పడ్డాడు. ఆరేళ్ల కనుకయ్య 34 గుంటల భూమిని కొనుగోలు చేయగా, లక్షల రూపాయల వరకు అప్పు అయ్యింది. రెండేళ్ల క్రితం కనుకయ్య చిన్న కుమారుడు రాజ్‌కుమార్‌కు యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం మూడు లక్షల వరకు అప్పు అయ్యింది. మొత్తం నాలుగు లక్షల అప్పు కావడంతో అదే తీర్చేందుకు కనుకయ్య ప్రస్తుతం హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పు తీర్చలేననే బాధతో గురువారం పురుగుల మందు తాగగా, శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జూలై 5: కూతురుకు వివాహం జరగడం లేదని మనస్తాపంతో మద్యానికి బానిసగా మారి పురుగుల మందుతాగిన గణేశ్‌నగర్‌కు చెందిన తోట వెంకటేశ్వరరావు(55) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 25న ఇంటిలో మద్యంలో పురుగుల మందు కలిపి తాగగా కుటుంబసభ్యులు వెంకటేశ్వరరావును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు మృతుడి భార్య నాగలక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

సారంగాపూర్,జూలై, 5 : మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పీసు ప్రవళిక(36) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతూ గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు ప్రవళికకు అదే గ్రామానికి చెందిన పీసు తిరుపతి రెడ్డితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే తిరుపతి రెడ్డి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుకుంది. అందరూ నిద్రో ఉన్న సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తల్లి బద్దం మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలిక ప్రసవం

● ఓ యువకుడు మోసం చేశాడని తల్లి ఫిర్యాదు

● కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సైదాపూర్, జూలై 5: సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) పెళ్లి కాకుండానే ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉంటూ పనికి వెళ్తుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయ్యే యువకుడు(17) ఆమెపై అత్యాచారానికి పాల్పడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ నెల 1న వరంగల్ ఎంజీఎంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎండపల్లి, జూలై 5: మండలంలోని గుళ్లకోట గ్రామంలో తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామంలో మూల లచ్చయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే శుక్రవారం కూడా తాటిచెట్టు ఎక్కాడు. పైకి ఎక్కాక మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

మహిళపై కోతుల దాడి

బీర్‌పూర్, జూలై 5: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన మహిళపై శుక్రవారం కోతులు దాడి చేసి గాయపరిచాయి. బీర్‌పూర్ గ్రామానికి చెందిన చిర్నేని రఘునా అనే మహిళ తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా చెట్టుపైన ఉన్న కోతులు ఒకే సారిగా కిందకు దూకి దాడి చేసి గాయపరిచాయని బాధిత మహిళ తెలిపింది. కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇంట్లో దూరి వంట సరుకులు చిందరవందరగా చేస్తూ ఇంటి పై కప్పులు తొలగిస్తున్నాయని వాపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సిరిసిల్ల చేనేత అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

» హైదరాబాద్‌లో రూ. 100 కోట్లతో ప్రత్యేక మాల్ ఏర్పాటుకు యత్నం

» 35 మంది యువ పారిశ్రామికవేత్తలతో వెలిచాల రాజేందర్‌రావు భేటీ

» మిల్లుల ఆధునికీకరణ, ప్రింటింగ్, డైయింగ్ మిషన్‌లపై చర్చ


యువ పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్/సిరిసిల్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం, చేనేత రంగ అభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశామని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా తాను కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన 35మంది చేనేత కుటుం బాలకు చెందిన యువ పారిశ్రామిక వేత్తలు శుక్రవారం వెలిచాల రాజేందర్‌రావును కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి లోతుగా చర్చించారు. వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన యువ పారిశ్రామిక వేత్తలు. యువకుల ఆలోచనకు అనుగుణంగా నవతరం దృక్పథంతో నవీన పద్ధతుల్లో ముందుకు వెళ్లాలని ఆలోచనతో రాజేందర్‌రావును కలిసి వారి ఆలోచన లను తెలిపారు. వీరిలో 10 మంది 10 రోజులు తమిళనాడులో వస్త్ర పరిశ్రమలకు ప్రసి ద్ధిచెందిన తిర్పూర్, కోయంబత్తూర్, సేలం లాంటి పట్టణాలను సంద ర్శించి 10 రోజులు అక్కడే వస్త్ర పరిశ్రమ గురించి అవగాహన చేసుకున్నారు. వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికల సమయంలో సిరిసిల్ల విజన్ డాక్యుమెంట్ తయారుచేసి, యువ పారిశ్రామికులతో రోడ్ మ్యాప్ కోసం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ వచ్చే వారం సిరిసిల్లలో మరోసారి సమావేశమై దీనికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ తరువాత హైదరాబాద్లో టెక్స్‌టై ల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, టెక్స్‌టైల్ కమిషనర్ అలుగు వర్షిణి, మంత్రి పొన్నం ప్రభాకర్, శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలువనున్నట్లు తెలిపారు. ఆ తరువాత వారంలో ముఖ్యమంత్రిని కలిసి సిరిసిల్ల చేనేత రంగం అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో పాటే తాను తయారు చేసిన సిరిసిల్ల వీవర్స్ విజన్ డాక్యుమెంటును కూడా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే విషయాన్ని సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. వస్త్రవిహార్ పేరుతో హైదరాబాద్‌లో ఒక ఆధునిక మాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం రూ. 100 కోట్ల క్యాపిటల్‌తో ముఖ్యమంత్రితో మాట్లాడతానని రాజేందర్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు అందించి సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమకు వచ్చే స్కీములు, సబ్సిడీలు, గ్రాంట్లు ఇంట్రెస్ట్‌ఫ్రీ లోన్స్ సాధించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గోవింద్ శ్రీకాంత్, దూడం శ్రీకాంత్, భానుచందర్, వంశీకృష్ణ, సతీష్, ప్రవీణ్, శ్రీరాం, భరత్, కోమాకుల మల్లికార్జున్, వేణుగోపాల్, దూస రమేష్, అడెపు వివేక్, గాజుల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌లు శుక్రవారం పట్టుకున్నారు. గండ్రపల్లి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ధర్మారంలో తనుగుల కుఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను కొత్తపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. వాటికి ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో మల్లేష్, కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, ధనూష్, అరవింద్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

వీణవంక: చల్లూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్ సాగర్, యజమాని ఉండాటి పోచయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కారు ఢీ కొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన పల్లె రజిత బావి వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరి వస్తూ, తన భర్త మహేందర్‌రెడ్డి కోసం కరీంనగర్-వరంగల్ రహదారిపైన రోడ్డు పక్కకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్లే కారు రజితను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాల య్యాయి. రజిత అపస్మారక స్థితిలోకి చేరింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

‘నీట్’పై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మతం ముసుగులో విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు చేస్తున్నాయని వాస్తవాలను వక్రీకరించే విధంగా బీజేపీ ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. దేశంలో లక్షలాది మంది వైద్య విద్యార్థులకు చెందిన నీట్ పరీక్ష ప్రహసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నీట్ పరీక్ష ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్రమే పరీక్ష నిర్వహణ చేసేదని, పారదర్శకత పేరుతో జాతీయస్థాయి పరీక్షగా మార్చి కేంద్రం గుత్తాధిపత్యం తీసుకుందని విమర్శించారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహించలేని అసమర్థత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే తన పరిధిలో పనిచేసే సీబీఐకి కేసును అప్పగించిందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఫల్యంతో విశ్వాసం సన్నగిల్లి అభద్రత భావన చోటుచేసుకుందన్నారు. పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందన్నారు. పరీక్ష లీకేజీపై ఆయా విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే , దాని దృష్టిని మరల్చేందుకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన తెలియజేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కార్యక్రమం ప్రవేశపెట్టిందని, దీంతో పాటు అవినీతి రహిత పాలన కోసం సమాచార హక్కు చట్టం, ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే తలంపుతో విద్యాహక్కు చట్టం, నిరుపేదల కడుపు నింపేందుకు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసిందని, కానీ పదేళ్ల ఎన్డీయే పాలనలో నోట్ల రద్దు, జీఎస్టీ, నిత్యావసర ధరల పెంపు వంటి ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను గమనించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, జిల్లా బాధ్యులు గిరి నాగభూషణం, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, సీనియర్ నాయకులు రాధాకిషన్‌రావు, గుంటి జగదీశ్వర్, నెహాల్ బొల్లి శేఖర్ తదితరులున్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 5: గ్రామస్థాయిలో సీపీఐని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీపీఐ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం పటిష్ఠంగా ఉండేదన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, ఆయా జిల్లాల్లో పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసుకో వల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సంఘాలు నిర్మాణాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రజాసంఘాల పునర్నిర్మాణం చేసుకుని కమిటీలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసినట్లయితే స్థానిక ఎన్నికల్లో గెలుపొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సీపీఐ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గోశిక మోహన్, ఆయా జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరుల పేరిట వసూళ్లు.. ముగ్గురి రిమాండ్

వేములవాడ టౌన్, జూలై 5: విలకరుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డివిజన్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన సిద్దయ్యకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 ఏళ్లుగా కాలువ నీటితో సాగు చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి కాలువను కూడిపి వేసి కింద ఉన్న వ్యవసాయ పొలాలకు సాగు నీరు వెళ్లకుండా చేశాడు. దీంతో కరుణాకర్, నరేష్, ప్రసాద్ అనే ముగ్గురు తాము విలేకరులమని, మల్లయ్యతో మాట్లాడుతామని అందుకు రూ.50 వేలు ఇవ్వాలని సిద్దయ్యను డిమాండ్ చేశారు. దీంతో సిద్దయ్య రూ.15 వేలు అందజేశాడు. కొద్ది రోజులకు మరిన్ని డబ్బులు ఇవ్వాలని అడుగగా సదరు రైతు నిరాకరించాడు. సదరు ముగ్గురు వ్యక్తులు మల్లయ్యతో చేరి సిద్దయ్య పొలానికి వెళ్లే రోడ్డును పూర్తిగా ధ్వంసం చేయించారు. దీంతో సిద్దయ్య కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.265 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.330 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

299 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

మానకొండూర్, జూలై 5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ నుంచి మహారాష్ట్రలోని నాందేడుకు తరలిస్తున్న 299 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం లభ్యం కావడంతో పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి వరంగల్‌కు చెందిన డ్రైవర్ జమీల్, సయ్యద్ హైమద్, క్లీనర్ కుశాల్‌రావు, తడక సతీష్, జన్ను అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పెంపుడు జంతువులతో.. జాగ్రత్త



- వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- అవగాహన కలిగి ఉండాలని నిపుణుల సూచన
- నేడు వరల్డ్ జూనోసిస్ డే

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలక్షేపం, సరదాగా పెంచుకునే జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని నిపుణు లు చెబుతున్నారు. శనివారం వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

● రేబిస్ రాకుండా..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి సారిగా 1885 జూలై 6వ తేదీన పిచ్చి కుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెం పుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

● 200 రకాల వ్యాధులు..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతు వుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నప్పటికీ పూర్తి స్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడు వాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మే కల ద్వారా అంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసె ల్లోసిస్ తదితర వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు అంటున్నాయి. వ్యాధు లు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నాకూడా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. కుక్కలు తది తరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినప్పుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యం త ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు. పిచ్చి కుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధి కుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటుంది.



అవగాహన అవసరం..

మూగజీవాల పెంపకంలో అవగాహనతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం. మనం ఎంతో అభిమానంగా పెంచుకునే కుక్కల నుంచి ర్యాబిస్, గజ్జి, పశువుల నుంచి, గొర్రెలు, మేకల వంటి గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధుల లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వ్యాక్సినేషన్ చేయించాలి..



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్ర మించే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెం దకుండా ఉండా లంటూ రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలి.

- కందుకూరి పూర్ణచందర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్

● ఇవి పాటిస్తే మేలు..

వ్యాధుల బారిన పడకుండా జగ్రాత్తలు పాటించాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను సైతం శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్క లతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి పెంపుడు కుక్కలకు ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరి గా టీకాలు వేయించాలి. పశు వైద్యులు, సిబ్బందిని సంప్రదించి వివరాలను తెలుసుకొని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

'అల్ఫోర్స్'లో మెహంది ఉత్సవ్



మెహందిపెట్టుకుంటున్న అల్ఫోర్స్ విద్యార్థులు

భగత్‌నగర్, జూలై 5: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన మెహంది ఉత్సవన్ ప్రకృతి ఒడిలో అందాన్ని నింపింది. ఈ సందర్భంగా మెహంది ఉత్సవ్ అల్ఫోర్స్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆషాఢమాసం చాలా విశిష్టమైనదని దీనికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆషాఢ మాసంలో మహిళలకు అత్యంత ప్రీతికరమైన మైదాకు ఎంతో విశిష్టమైనదన్నారు. ఈ సందర్భంగా అమ్మమ్మ తెచ్చింది మైదాకు-నానమ్మ తెచ్చింది మైదాకు మేము పెట్టుకున్నాం మైదాకు మా ఇంట్లో మొలిచింది ఆకు మైదాకు మెరిసింది ఆకుమైదాకు అంటూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 5: అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్ యందు సబ్ జూనియర్ విభాగంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన రన్నింగ్ పోటీలలో స్థానిక భగత్‌నగర్‌లోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-10 బాలికల విభాగంలో 300 మీటర్ల రన్నింగ్ పోటీలలో దేవాన్సి, జి సాక్షర మొదటి స్థానం సాధించగా స్టాండింగ్ బ్రాడ్ జంప్ పోటీలో డి. అన్విత‌రెడ్డి మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. వీరు జులై 7వ తేదీన హైదరాబాద్‌లో గచ్చిబౌలి పుల్లెల గోపీచంద్ అకాడమీలో జరగబోయే పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులను చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, సంగీత, ఉపాధ్యాయబృందం, ఇతర విద్యార్థులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

పోటీ పరీక్షల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, జూలై 5: గ్రూప్స్ పోటీ పరీక్షల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్‌చేశారు. తెలంగాణలో పదేళ్ల కాలం లో గత ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య తీవ్రస్థాయికి పెరిగిందన్నారు. దీంతో చాలా మంది అభ్యర్థులకు ఏజ్‌లిమిట్ కూడా దాటి పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగ నోటిఫికే షన్లపై నిరుద్యోగులకు ఆశలు మరింత పెరిగాయాన్నారు. ఉపాధ్యాయుల పోస్టులుపెంచి డిఎస్సీ నోటిఫికేషన్ విడుద ల చేయాలన్నారు. గ్రూప్-1కి 1:100 అవకాశం కల్పించా లని డిమాండ్ చేశారు.

ఎమెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చిగురుమామిడి, జూలై 5: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తాజా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాల మండల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత బహుజనులను కించ పరిచే విధానం సరికాదన్నారు. ఎమ్మెల్యే క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు ఉధృతం చెస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెజ్జంకి అంజయ్య, బోయిని వంశీకృష్ణ, బాబు, సంజీవ్, వెంకటేష్, రమేష్, బిక్షపతి, సతీష్, రాజు, వెంకట్రాజయ్య, కనుకయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జూలై 5: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మార్నింగ్ వాక్‌లో వాకర్స్‌తో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ సభ్యులు గ్రౌండ్‌లోని సమస్యల గురించి ప్రణవ్‌కు వివరించారు. దీనికి స్పందించి ప్రణవ్ గ్రౌండ్‌లో నీరు నిల్వ లేకుండా ఉండడానికి డ్రయినేజీ, లైటింగ్, ట్రాక్ ఏర్పాటు, సేద తీరేందుకు కుర్చీలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం వాకింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్నూకర్ పాయింట్‌ను హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పొనగంటి మల్లయ్య, సుంకరి రమేష్, మొలుగూరి సదానందం, బొంగోని వీరన్న, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, పర్లపల్లి నాగరాజు, ఎండి సలీం, సతీష్‌రెడ్డి, పోతిరెడ్డి మల్లయ్య, దొడ్డె సదానందం పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

హుజూరాబాద్, జూలై 5: పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అన్నారు. హుజూరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి జిల్లాలో పెన్షనర్లకు వెల్‌నేస్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఈహెచ్‌ఎస్ స్కీమ్‌లను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కట్ట నాగభూషణచారి, చొల్లేటి మల్లారెడ్డి, బొంగోని వెంకటయ్య, మునీరుద్దీన్, సమ్మయ్య, వీరస్వామి, చంద్రయ్య, కిష్టయ్య, సనత్ కుమార్, గంగయ్య, హరికిషన్, రాజిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోరింటా పూచింది...



శనివారం నుంచి ప్రారంభమయ్యే ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం నగరంలోని జ్యోతినగర్‌లో అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షురాలు, బీజేపి మహిళా మోర్చా మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి సుజాతారెడ్డి, సునిత, స్వప్న, విజయ, శ్వేతారెడ్డి, సుమారెడ్డి, రమారెడ్డి, మంజులారెడ్డి, మౌనిక, శైలజ, విజయ పాల్గొన్నారు. - కరీంనగర్ కల్చరల్

వానాకాలం.. వ్యాధుల కాలం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం - కొత్తనీటితో మరిన్ని వ్యాధులు ప్రబలే అవకాశం

సుభాష్‌నగర్, జూలై 5: వానాకాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా కొత్తనీరు రావడంతో మరిన్ని వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. దోమల వల్ల డెంగీ, చిగున్‌గున్యా, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయి. కలుషిత నీటివల్ల డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ వ్యాధులు సోకుతాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, చెదారం తొలగించాలని, పాత టైర్లు, పగిలిన సీసాలు, కుండలు, పాత టైర్లలో నీరు నిలువకుండా చూసుకోవాలని, వీలైతే వాటిని బయట పడవేయాలని సూచిస్తున్నారు. కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాటి బారిన పడ్డవారు జ్వరం, వాంతులు, విరేచనాలు అవుతాయి.



● వైరల్ ఫీవర్ రావడానికి కారణాలు...

వైరల్ ఫీవర్ ఒకరి నుంచి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నపుడు కూడా వైరల్ ఫీవర్ విజృంభిస్తుంది.

● లక్షణాలు...

వైరల్ ఫీవర్‌తో బాధపడేవారిలో జ్వరం, ఒళ్ళు నొప్పులు, నీరసం, ఒంటిపై దద్దుర్లు, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతునొప్పి, ముక్కు కారడం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

● వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు...

ఇంటిని, ఇంటి పరిసరాలను ఎపుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి వేడి ఆహారం తీసుకోవాలి. తాజా పండ్లను తీసుకోవాలి. దోమ తెరలను వాడాలి. కిటికీలకు తెరలను ఏర్పాటు చేసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

● బయట ఆహారం తీసుకోవద్దు..

బయట ఆహారం అస్సలు తీసుకోకూడదు. ముఖ్యంగా పానీపూరి, జంక్‌ఫుడ్ అస్సలు తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, జూలై 5: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) ఆధ్వర్యంలో డీఈవో సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు లింగాల అంజిబాబు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ 25శాతం విద్యా విధానం అమలు చేయాలన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



రాజేందర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్, జూలై 5: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ విభాగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 2003లో నియామకమైన 300 మంది ఉద్యోగుల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన 22 మంది ఉద్యోగులు సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 5: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన జూనియర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించిన వారు రశీదులతో రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దుర్గాభవాని ఆలయంలో ఫలపంచామృతాభిషేకం



అమ్మవారులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ రూరల్, జూలై 5: ఆషాఢ మాసం శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవాని అమ్మవారికి పురాణం మహేశ్వరశర్మ ఫలపంచామృతాభిషేకం, విశేషహారతులు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శాకాంబరి ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం, చీరసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● నేటి నుంచి శాకాంబరీ ఉత్సవాలు...

నగునూర్ గ్రామంలోని దుర్గాభవానీ ఆలయంలో జరుగనున్న శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శాకాంబరీ కలశస్థాపన, అమ్మవారికి పుదీనా మాలలతో అలంకరణ, విశేష పూజలు జరుగుతాయని భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ కోరారు.

మహిళా సమాఖ్య ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 5: నగరంలోని 11వ డివిజన్ కట్టరాంపూర్ విఘ్నేశ్వర మహిళా సమాఖ్యకు చెందిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవా లని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 10 మంది సభ్యులతో కూడిన 20 మహిళా సంఘాలు విఘ్నేశ్వర మహిళా సమాఖ్యలో భాగస్వాములుగా ఉన్నాయన్నారు. ఆర్‌పీ అరుణ మహిళా సంఘాలకు సంబంధించిన ప్రతినెలా వడ్డీ రూపాయలను తన సొంత ఖర్చులకు వాడుకున్నారని సభ్యులు ఆరోపించారు. ఇప్పటివరకు ఆర్‌పీ 12 లక్షల మేరకు సొంతానికి వాడుకున్నందున విచారణ జరిపించి ఆర్‌పీని తొలగించి చర్య తీసుకోవాలని సమాఖ్య సభ్యులు కోరారు.

బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుల అరెస్టు



బీఆర్‌ఎస్‌వీ నాయకులతో చల్ల హరిశంకర్

కరీంనగర్ క్రైం, జూలై 5: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిషన్ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులను శుక్రవారం ఉదయం కరీంనగర్‌లోని పోలీసులు అరెస్టు చేసి వివిధ ఠాణాలకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు, గ్రం థాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపించటంలో శ్రద్ధను కనబరచాలన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

అరెస్టు అయిన వారిలో నాయకులు తిరుపతి నాయక్, ఎస్‌యూ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, పటేల్‌శ్రవణ్‌రెడ్డి, రవిగౌడ్, సుధీర్‌రెడ్డి, రాజ నరేష్‌రెడ్డి, సురేష్, బీఆర్‌ఎస్‌వి నగరశాఖ అధ్యక్షుడు బొంకూరి మోహన్, దీకొండ కులదీప్, సాయికృష్ణ, తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అరెస్టు అయిన నాయకులకు బాసటగా నిలిచి భరోసా కల్పించారు.

అధ్వానంగా రోడ్లు

- చినుకుపడితే చిత్తడి
- రాకపోకలకు గ్రామస్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గుంతలు పడ్డ కాట్నపల్లి రోడ్డు

చొప్పదండి, జూలై 5: దశాబ్దకాలంగా పల్లెరోడ్లకు మరమ్మతులు కరువయ్యాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేటకు వెళ్లే రోడ్డుపై చాలా చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడు తున్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. మండలంలోని రాగంపేట, రేవెల్లి, పెద్దకుర్మపల్లి, దేశాయ్‌పేట గ్రామాలతో పాటు రామడుగు, పేగడపల్లి గ్రామాల ప్రజలు ఈ రోడ్డు పై రాకపోకలు కొనసాగిస్తున్నారు. రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి వరకు 2002లో ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద బీటీ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. పలుచోట్ల ధ్వంసమైంది. కాట్నపల్లి, కోనేరుపల్లి, మల్లన్నపల్లి, సాంబయ్యపల్లి, గ్రామాల ప్రజలు ఈరోడ్డుపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. కోనేరుపల్లి గ్రామానికి కాకతీయ కాలువ వెంట మట్టిరోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురు స్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన కోనేరుపల్లి రోడ్డు

మొక్కలు నాటిన నాయకులు

చొప్పదండి, జూలై 5: మండలంలోని రాగంపేటలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని కిసాన్‌మోర్చా నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, గోపు దామోదర్‌రెడ్డి, ధర్మారెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్

రామడుగు, జూలై 5: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొన్నం భాస్కర్, పవన్ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్ట్‌లు సరికావు

జమ్మికుంట, జూలై 5: కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేపట్టడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం నిరుద్యోగులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న విద్యార్థి సంఘాలు, రైతు సంఘం నాయకులను పోలీస్‌లు ముందస్తుగా అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామి ఇచ్చి ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. అక్రమ అరెస్టులతో వెనక అడుగు వేసే ప్రశక్తి లేదన్నారు. పోలీస్‌ల అదుపులో చెల్పూరి రాము, కొమ్ము నరేష్, గట్టు సాయిరాం, పసునూటి వెంకటేష్, కొత్త గణపతిరెడ్డి, కరంకొండ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: నిరుద్యోగులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు హైద్రాబాద్ తలపెట్టిన కార్యక్రమానికి బయలుదేరుతున్న నిరుద్యోగులను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్ని అక్రమ కేసులు పెట్టిన బయపడే ప్రసక్తి లేదన్నారు. వెంటనే నిరుద్యోగ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలేటీ శ్రీరామ్, మాదారపు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: విద్యార్థి సంఘ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని ఎస్సై తోట తిరుపతి పోలీస్‌స్టేషన్‌కు తరిలించారు. ఆవుల తిరుపతి, రాపర్తి అఖిల్‌గౌడ్, అప్పని హరీష్ వర్మ, అంగిడి కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

న్యాయం చేయాలని వినతి

రామడుగు, జూలై 5: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్య శుక్రవారం హైద్రాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్, డీజీపీలకు కలిసి తనకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. తనపై అన్యాయంగా కేసు బనాయించి పోలీసులు చిత్రహింసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు ఒప్పుకోవాలంటూ రెండు రోజుల పాటు పోలీసులు థర్డ్ డిగ్రీ సైతం ప్రయోగించారని తెలిపారు. నేరం ఒప్పు కోకపోతే చంపుతామని బెదిరిస్తున్నట్లు వినతి పత్రంలో వెల్లడించారు. బాధితుడి వెంట ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పార్థసారధి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ ఉన్నారు.

గీతాభక్త సమాజం ఆధ్వర్యంలో నేడు శోభాయాత్ర

కరీంనగర్ కల్చరల్, జూలై 5: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరం పీఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో గీతాభక్త సమాజం నేతృత్వంలో శనివారం సాయంత్రం 5-30 గంటల నుంచి గీతామందిరం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భజనలు, కోలాట నృత్యాలతో యాత్ర గీతామందిరం నుంచి ప్రారంభమై పాతబజార్ శివాలయం, ప్రకాశంగంజ్, టవర్ సర్కిల్ ద్వారా వైశ్యభవన్ చేరుతుందని పేర్కొన్నారు. ఆదివారం గీతామం దిరంలో ఉదయం 8 గంటల నుంచి కలశ, గణపతి పూజ, శ్రీకృష్ణునికి అభిషేకం, అనంతరం సంపూర్ణ భగవద్గీత సహస్రగళ పారాయణం జరుగుతాయని తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

జాతీయస్థాయి వాటర్ పోలో పోటీల్లో జిల్లాకు పేరు తీసుకురావాలి



అభినందిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 5: జాతీయస్థాయి వాటర్ పోలో పోటీల్లో సత్తాచాటి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆకాంక్షించారు. జాతీయ పోటీలకు ఎంపికైన శ్రీవర్‌ను శుక్రవారం అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్స్‌లో ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాటర్ పోలో పోటీలకు జిల్లా నుంచి కంకణాల శ్రీవర్ ఎంపికయ్యారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాటర్ పోలో పోటీల్లో రాణించిన శ్రీవర్ జాతీయపోటీలకు ఎంపిక కావడంపై మేయర్ శాలువతో ఆయనను సత్కరించారు.

సహకార పరపతి సంఘం కార్యవర్గం

సుభాష్‌నగర్, జూలై 5: శ్రీరాజరాజేశ్వర సహకార ఉద్యోగుల సహకార పరపతి సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నగరంలోని సహకార భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా కె జమునరాణి, ఉపాధ్యక్షుడిగా టి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా లచ్చయ్య, కోశాధికారిగా ఎన్ నరసింహమూర్తి, డైరెక్టర్లుగా భూక్యరాజు, సయ్యద్ సాజిద్ పాషా, బాలే శ్రీనివాస్, ఎండీ రియాజ్‌పాషా, జి రూపను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మంజుల వ్యవహరించారు. ఈ సందర్భంగా టీసీఎన్‌జీవో అధ్యక్షుడు జలాలోద్దీన్ అక్బర్, కార్యదర్శి ప్రీత్‌పాల్‌సింగ్, కోశాధికారి మనోజ్ అభినందిం చారు.

స్టేషనరీ, బ్యాగుల పంపిణీ

సుభాష్‌నగర్, జూలై 5: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాల ఆవరణలోగల ప్రభుత్వ బాలకల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నగరంలోని సంజీవని నర్సింగ్‌హోమ్ యజమాని డాక్టర్ విజయలక్ష్మి స్టేషనరీ, బ్యాగులు, లంచ్ బాక్సులు, డ్రాయింగ్ కిట్స్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యాన్‌కైండ్ ఫార్మా సహకారంతో బహుమతులను అందచేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

కరీంనగర్ క్రైం, జూలై 5: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ తమ్మనవేని కుమారస్వామి(43) శుక్రవారం మృతి చెందాడు. 2007 బ్యాచ్‌కు చెందిన కుమారస్వామి ఏఆర్ విభాగంలో పోలీసుశాఖలో చేరి, ఇటీవలనే సివిల్ విభాగానికి మారాడు. కుమారస్వామి అంత్యక్రియలు ఆయన స్వగ్రామం జమ్మికుంట మండలం మోత్కులగూడెంలో జరిగాయి. కుమారస్వామి అంత్యక్రియల్లో కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్, జమ్మికుంట సీఐ రవి, ట్రాఫిక్ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల అరెస్టు

మానకొండూర్, జూలై 5: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్ నిరసన తెలిపేందుకు వెళుతున్న బీజేవైఎం మండల నాయకులను శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షుడు బి ప్రదీప్‌యాదవ్, కోంద్ర వరప్రసాద్, మడ్డి రాకేశ్‌గౌడ్ ఉన్నారు.

కొండయ్యపల్లి వాసికి డాక్టరేట్

గంగాధర, జూలై 5: గంగాధర మండలం కొండయ్యపల్లికి చెందిన తుమ్మల నాగరాజు ఉస్మానియ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. హైపర్ స్పెక్ట్రల్ శాటిలైట్ డేటాను ఉపయోగించి కరీంనగర్, ఆదిలాబాద్ ఏరియాల్లో మైనింగ్ కారణంగా క్షీణత అంశాన్ని అంచనావేయడంపై జియాలజీ శాఖ నేతృత్వంలో పరిశోధన చేశారు. ఈసందర్భంగా నాగరాజును జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్యతో పాటు గ్రామస్థులు అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మానకొండూర్, జూలై 5: మండలంలోని గట్టుదుద్దెనపల్లి, ముంజంపల్లి గ్రామాలకు చెందిన గర్రెపల్లి రాజేశ్వరి, దాసరి మల్లమ్మ ఇటీవల మృతి చెందగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శుక్రవారం బాధిత కుటుంబాని పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, శాతరాజు యాదగిరి, గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సైదాపూర్, జూలై 5: సైదాపూర్ మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన బోయిని భూమిక, పడాల శ్రీజ, తీగల సాయి చరణ్, నార్లగిరి మధుమిత అనే నలుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పర్వీన శుక్రవారం అభినందించారు. ప్రభుత్వ పాటశాలలో చదువుకొని పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమని కొనియాడారు.

పంటల వివరాలు నమోదు

ఇల్లందకుంట, జూలై 5: మండలంలోని వంతడుపుల గ్రామంలో ఆరుతడి పంటలు వేసిన రైతుల వివరాలు వ్యవసాయ విస్తరణాధికారి రాకేష్ శుక్రవారం నమోదు చేశారు.పత్తి, మిరప, ఇతర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఈవో రాకేష్ మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో 7,857 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారన్నారు.

విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దు

హుజూరాబాద్‌రూరల్, జూలై 5: విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దని ఎక్సైజ్ ఎస్సై తమ్మిశెట్టి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని కందుగుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సారాబుడ్ల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వలన కలిగే అనార్థల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ భారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.